క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



దాచేపల్లి : నారాయణపురంలోని ముత్యాలమ్మ తల్లికి ఆదివారం మహిళలు బోనాల సమర్పించారు. విస్తారంగా వర్షాలు కురిసి, పంటలు పండి అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు మహేష్ ఫ్యాన్స్ చేయూత



కారెంపూడి: గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారికి కారెంపూడి మండల మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ దృష్టికి ఆదివారం విషయాన్ని తీసుకెళ్లి చిన్నారి గుండె ఆపరేషన్‌కు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో ఏర్పాట్లు చేయించారు. దీంతో పాటు అంతా చందాలు వేసుకుని వారి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని చిన్నారి తండ్రికి అందించారు. కార్యక్రమంలో గోళ్ల సురేష్ యాదవ్, మండల ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణితి అమరయ్య, కార్యదర్శి షేక్ నన్నెసా పాల్గొన్నారు.

16న బైబిల్ క్విజ్ పోటీలు

కారెంపూడి: స్థానిక సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో 16న బైబిల్ క్విజ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైబిల్ పఠనాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నామని, మార్క్ సువార్త అంశంపై ప్రశ్నలుంటాయని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 6362218163 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలి

కారెంపూడి: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదులమూడి హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అధికారంలోకి వచ్చాక రూ.25 వేల జీతంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. దీనికి ఆశపడి తామంతా కూటమికి ఓట్లు వేశామని, అధికారంలోకి వచ్చి 14 నెలలయినా అమలు పర్చలేదని పేర్కొన్నారు. సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతున్నారని, మృతి చెందితే వారి కుటుంబానికి కనీస భరోసా కల్పించడం లేదని తెలిపారు. తమకు కూడా రిటైర్‌మెంట్ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఆటో, ఉద్యోగుల ఫైనాన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కారెంపూడి: కారెంపూడి ఆటో, ఉద్యోగుల ఫైనాన్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొగ్గవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గణితి అమరయ్య, కార్యదర్శిగా ముచ్చర్ల రామకోటేశ్వరరావు, ఉప కార్యదర్శిగా సూరె కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా సన్నిధి శ్రీనివాసరావు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు



వినుకొండ: మానవ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ వృద్ధుడి మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు రెండు రోజుల క్రితం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచి, అతని ఆచూకీ కోసం ప్రయత్నించారు. మృతునికి సంబంధించిన వివరాలు తెలియక పోవడంతో మానవ సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవానిశంకర్, సభ్యులు అంజి, మస్తాన్‌వలి, జాబీర్, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలా..పుష్పక విమానాలా ?

- ప్రమాదం జరిగితే 'ఆటో'.. ఇటో !
- తొమ్మిది గ్రామాలకు ఆటోలే దిక్కు
- కిక్కిరిసి ప్రయాణాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు



ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మహిళలు, విద్యార్థినులు

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలకు ఆటోలే దిక్కయ్యాయి. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రజలు గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని మంచికల్లు, రెంటాల, మిట్టగుడిపాడు, పాలువాయి, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఒక్కో వాహనంలో ఇరవై మందికి పైగా ప్రయాణించడం చూస్తుంటే గుండెల్లో దడ పుట్టక మానదు.

ఆదాయం లేదంటూ ఆర్టీసీ బస్సుల నిలిపివేత

గతంలో రెంటాల, మిట్టగుడిపాడు, మంచికల్లు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంది. మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి(జాతీయ రహదారి 167 ఏడీ) రెంటచింతల, పాలువాయిగేటు గ్రామాల నుంచి వెళ్తుండటంతో ఆ రెండు గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ఆదాయం లేదంటూ ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. మాచర్ల ఆర్టీసీ డిపో అధికారి సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆటో ప్రమాదాలే ఎక్కువ

ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువగా ఆటోలే ఉంటున్నాయి. డ్రైవర్లు కూడా పరిమితికి మించి కిక్కిరిసేలా సుమారు 20 మంది ఎక్కించుకుంటున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. కనురెప్ప కాలంలో జరుగుతున్న ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్న విషయం తెలిసినా ప్రజలు గత్యంతరం లేక ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. నిత్యం విద్యార్థులు, కూలీలు, చిరు వ్యాపారస్తులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు, విద్యార్థులు

బస్సులు లేక ఆటోలే దిక్కు



మా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యంలేక పోవడంతో ఆటోలే మాకు దిక్కు. ఆటో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా, సమయానికి పనులకు వెళ్లాలంటే కిక్కిరిసి ప్రయాణించక తప్పదు. ఆటో ఎక్కినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నాం. మా గ్రామం నుంచి ఏ గ్రామానికీ కూడా బస్సు సౌకర్యంలేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

–వడితే భీమ్లానాయక్, జెట్టిపాలెం

వరి సాగులో సాలు నాటు పద్ధతి శ్రేయస్కరం

కారెంపూడి: సాలు నాటు, బెంగాల్ నాటు పద్ధతిలో వరి నాట్లు వేయించాలని ఏఓ పోట్ల నరసింహారావు రైతులకు సూచించారు. మండలంలోని కాకానివారిపాలెంలో ఆదివారం ఆయన వరి నాట్లు వేసే పద్ధతిని పరిశీలించారు. కొందరు రైతులు బెంగాల్ నాటు వేయిస్తున్న విధానాన్ని చూసి అభినందించారు. మిగిలిన రైతులు కూడా పురాతన పద్ధతులను వీడి, సాలు నాటు లేదా బెంగాల్ నాటు పద్ధతిలో వేయించాలని ఆయన సూచించారు. సాలులో రెండు లేదా మూడు మొక్కల చొప్పున ఎనిమిది అంగళాల దూరం పాటిస్తూ నాట్లు వేయించాలని తెలిపారు. దీని వల్ల ఎటు చూసినా మొక్కల సాళ్లు బాగా కన్పిస్తాయని, గాలి కూడా బాగా తగులుతుందన్నారు. దీనివల్ల దోమపోటు వచ్చే అవకాశాలు బాగా తగ్గుతాయని, మొక్కల కాండం కూడా దృఢంగా మారుతుందని చెప్పారు. చీడ పీడల బెడద కూడా తగ్గుతుందని, దిగుబడి కూడా ఎకరాకు 4,5 బస్తాలు అధికంగా వస్తుందని వివరించారు. అయితే ఈ నాటు వేసే టప్పుడు వరి నారు వయస్సు 18 నుంచి 20 రోజుల మధ్య ఉండాలని ఆయన సూచించారు.



నాట్లు వేస్తున్న కూలీలు

'హలో మాల-చలో ఢిల్లీ' కరపత్రం ఆవిష్కరణ

విజయపురిసౌత్: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్ అధ్యక్షతన జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు విజయపురిసౌత్ హరిత రిసార్ట్‌లో 'హలో మాల -చలో ఢిల్లీ' కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఢిల్లీలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగే కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాలలంతా భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు మాచర్ల నియోజకవర్గం ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ల శ్రీనివాసరావు, స్థానిక మాల మహానాడు ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి విజయ్, ఉపాధ్యక్షుడు చింతమళ్ల చెన్నయ్య, కోశాధికారి రుద్రపాటి ధనుంజయరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కలుకూరి నాగేంద్రబాబు, సెక్రటరీ జక్కి ప్రేమ్ కుమార్, గౌరవాధ్యక్షుడు చింతమళ్ల యాకోబు, సంఘం పెద్దలు వేముల కొండలు, గొర్రెముచ్చు ఆంజనేయులు, మీసాల సాయిబాబా, బాబు, ఏసురత్నం పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాన్ పాల్ తదితరులు

పోలేరమ్మకు గోపిరెడ్డి ప్రత్యేక పూజలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో జరుగుతున్న శ్రీపోలేరమ్మ తల్లి కొలుపుల మహోత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర నాయకులు పడాల చక్రారెడ్డి, కార్యదర్శి గెల్లి చిన కోటిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బత్తుల రామకృష్ణ, ఎంపీటీసీ మోతుకూరి వెంకటేష్, మండల నాయకులు కల్లి వెంకటరెడ్డి, పానుగోటి వెంకట్రావు, గంటా వీరారెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, కల్లం శివారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వైద్యశిబిరానికి విశేష స్పందన

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శ్రీ గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సర్జన్ డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నరసరావుపేట గాంధీ హాస్పిటల్‌లో పని చేస్తున్న డాక్టర్ మెడబలిమి సౌమ్య, ఏలూరు ఆయుష్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ పాల్గొన్నారు. 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. నల్లమోతు ఫకీరయ్య, స్వరాజ్యమ్మ జ్ఞాపకార్థం తమ స్వగ్రామంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బీపీ, షుగర్, అన్ని రకాల పరీక్షలు, ఈసీజీ, కిడ్నీ, నరాల పరీక్షలు నిర్వహించారు. కొందరికి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో నాదెండ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నెల్లూరి సదాశివరావు, మొండెద్దు జగన్నాధరెడ్డి, నల్లమోతు నారాయణస్వామి, వేములపల్లి రామచంద్రయ్య, భుజంగరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నల్లమోతు ప్రవీణ్

ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక

నరసరావుపేట రూరల్: ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 11వ తేదీ నుంచి 20 వరకు ఏపీ, తెలంగాణ డైరక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌కు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ నేహా నర్తిత, సుమన్యలు ఎంపికైయ్యారని వివరించారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా క్యాడెట్స్ భారత సైన్యంలోని జీవన విధానం, క్రమశిక్షణ, ఆయుధాల వినియోగం, ఫీల్డ్ క్రాఫ్ట్, పరేడ్ డ్రిల్స్, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై శిక్షణ పొందుతారని కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాకేష్ తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, విభాగాధిపతి డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ వీఎస్ఎస్ లక్ష్మి అభినందించారు.



ఆర్మీ క్యాంప్‌నకు ఎంపికైన క్యాడెట్స్‌తో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు

'చిరుమామిళ్ల' హైస్కూల్‌కు పురస్కారం గర్వకారణం

కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు సిరిపురపు అప్పారావు



నాదెండ్ల: సరస్వతీ పుత్రుల నిలయమైన చిరుమామిళ్ల శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ డాక్టర్ సిరిపురపు అప్పారావు చెప్పారు. తన స్వగ్రామమైన చిరుమామిళ్ల ఉన్నత పాఠశాలకు గతంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ స్కూలుగా ఎంపిక చేసిందని, ఇక్కడి ఉపాధ్యాయులు అంకితభావం, క్రమశిక్షణతో విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆగస్టు 15న పురస్కారం అందుకోనున్న ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.

అమరావతిలో మరలా చోరీ

అమరావతి: ఇంటికి తాళాలు వేసి ఎంత అర్జంటు పని ఉన్నా అమరావతి గ్రామస్తులు ఊరికి వెళ్లటానికి భయపడుతున్నారు. గత గురువారం రాత్రి మండల కేంద్రమైన అమరావతిలో ఒకచోట చోరీకి విఫలయత్నం చేసిన దొంగను సీసీ పుటేజీలో గుర్తించారు. మరో చోట కొద్దిపాటి వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కొద్దిపాటి వెండి వస్తువులే కదా అని పోలీసులు కేసు నమోదు చేయకుండా లైట్ తీసుకున్నారు. ఈ క్రమంలో మరలా శనివారం రాత్రి మరో చోరీ జరగటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ సమీపంలో బందా వెంకటకృష్ణారావు దంపతులు వారం రోజుల క్రితం బెంగళూరులోని తమ కుమారుడు ఇంటికి వెళుతూ ఇంటి ముందు ముగ్గు వేయటానికి గేటు తాళాలను ఎప్పటిలానే పక్కింటి వారికి ఇచ్చి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ముగ్గు వేయటానికి గేటు తీసిన పక్కింటి వారు ఇంటి తాళాలు తీసి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇంటిలోని బీరువా తాళాలు పగలగొట్టి అందులోని దుస్తులు చిందరవందరగా పడవేసి ఉండటాన్ని గుర్తించారు. ఇంటి యజమానితో ఫోన్‌లో మాట్లాడి ప్రాథమిక విచారణ చేయగా కొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. ఇంటి యజమానులు బెంగళూరు నుంచి వస్తే గాని ఏమేమి చోరీకి గురయ్యాయో తెలియదు. ఈ ఘటనపై అమరావతి పోలీసులు క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



శావల్యాపురం: రక్తదానం చేయటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని రెడ్ క్రాస్, గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో గ్రామ పెద్ద ముక్కపాటి నాగేశ్వరరావు సారథ్యంలో నరసరావుపేట రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ముక్కపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను సకాలంలో కాపాడటం కూడా పౌరులుగా బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రాణానికి మూలం రక్తమని, ఆపత్కాలంలో రక్తదానం చేయటం మంచి సేవ అన్నారు. నేటి యువత రక్తదానం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను అభినందించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పొత్తూరి రాము, బెల్లకొండ ప్రసాదు, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారులో మంటలు

సకాలంలో అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



చిలకలూరిపేట: నిత్యం రద్దీగా ఉండే చిలకలూరిపేట ప్రధాన రహదారిలో ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట పట్టణంలోని సీఆర్ కాలనీ నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్‌కు వెళ్తున్న ఏపీ 39 కేడబ్ల్యూ 1912 నంబరు గల కారు మున్సిపల్ కార్యాలయం దగ్గరకు రాగానే, ఇంజిన్ నుంచి పొగలు రావడం మొదలైంది. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారు దిగి పక్కకు వెళ్లిపోయాడు. పొగలు చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ అదే రోడ్డులో ఉండటంతో, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే, వారు వచ్చేలోపు కారులోంచి మంటలు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి. సిబ్బంది అరగంటకు పైగా కష్టపడి అదుపులోకి తెచ్చారు. కానీ అప్పటికే కారు ముందు ఇంజిన్ భాగం పూర్తిగా కాలి ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ప్రజలకు గానీ, సమీపంలోని దుకాణాలకు గానీ ఎటువంటి నష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

జారిపడి గాయాలైన వృద్ధుడు మృతి

యడ్లపాడు: చర్చి ప్రాంగణంలో జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన విజయకాటన్ సమీపాన నివాసం ఉంటున్న అతిరాజు గురవయ్య(66) తమ ఇంటిపక్కనే ఉన్న చర్చికి శనివారం వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో అక్కడ వరండాలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతని తల వెనుక భాగంలో తీవ్రంగా గాయమైంది. స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో 108 వాహన సిబ్బంది బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. కానీ గాయాల తీవ్రతకు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు అతిరాజు మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

నివాసాల నడుమ జంతు కళేబరాలు

- దుర్గంధంతో టిడ్కో కాలనీ వాసుల ఇబ్బందులు
- పరిశీలించిన ప్రజాసంఘాల నాయకులు



జంతు కళేబరాలను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: టిడ్కో హౌసింగ్ కాలనీ పరిసరాల్లోని పశు కళేబరాలను వెంటనే తొలగించి, కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిలకలూరిపేట రోడ్డులోని టిడ్కో హౌసింగ్ సముదాయాన్ని పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, ఎంఐఎం నాయకుడు షేక్ మస్తాన్‌వలి తదితరులు ఆదివారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పది సంవత్సరాల క్రితం డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఇచ్చారని, ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. నీటి సౌకర్యం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, ప్రధాన రోడ్డులో కూడా వీధి దీపాలు లేవని తెలిపారు. కాలనీ చుట్టుపక్కల పశువుల కళేబరాలను, వ్యర్థాలను వ్యాపారులు నిల్వ చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి వచ్చే దుర్గంధంతో అవస్థలు పడుతున్నట్టు పేర్కొన్నారు. పశు వ్యర్థాలను జొన్నలగడ్డ – కేసానుపల్లి మధ్యలోని వాగులో వేస్తున్నారని, ఈ కలుషిత నీటిని రైతులు పంటలకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని తెలిపారు. పశువుల కళేబరాల వేయవద్దని అడ్డుకుంటే తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులు ఈ కాలనీ పరిసరాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



టిడ్కో కాలనీ సమీపంలో జంతు వ్యర్థాలు

గుక్కెడు నీరు దొరక్క తిప్పలు

- తాగునీటి కోసం రాజీవ్ గృహకల్ప వాసుల ఆందోళన
- 350 గృహాలకు రెండే కుళాయిలు



మంచి నీటి కోసం ఆందోళన చేస్తున్న రాజీవ్ గృహకల్ప వాసులు

నరసరావుపేట టౌన్: మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ గృహకల్ప వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నివాసితులు దుర్గాబాయి, మాణిక్యమ్మ మాట్లాడుతూ పెద్ద చెరువు రాజీవ్ గృహకల్ప సముదాయంలో 350 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. మొత్తానికి కలిపి రెండు మాత్రమే మున్సిపల్ కుళాయిలు ఉన్నాయన్నారు. దీంతో ప్రతి రోజు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. గృహకల్ప సముదాయంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద గల సంపు నుంచి నాలుగురోజులకొకసారి నీరు విడుదల చేస్తున్నానన్నారు. ఒక్కొక్కరివద్ద నుంచి రూ.200 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, ప్రస్తుతం ఆ నీటిని కూడా విడుదల చేయటం లేదని తెలిపారు. న్నారు. మంచినీటి కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్ అధికారులను కలిసి ఇప్పటికే అనేకమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. నివాసం ఉంటున్నవారంతా పేదలేనని, మంచినీరు కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు మంచినీటి బిందెలు మోసుకొని 3 అంతస్తులు ఎక్కాల్సి వస్తుండటంతో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. . ఇకనైనా అధికారులు స్పందించి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో షాహినా, శ్రావణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

చిలకలూరిపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మద్దిరాల గ్రామం వద్ద ఉన్న సాదినేని చౌదరయ్య కళాశాలలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల పాలక మండలి చైర్మన్ సాదినేని హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. జాబ్‌మేళాలో విచేంజ్ సొల్యూషన్స్, టెక్నో టాస్క్, బిజినెస్ సొల్యూషన్, అపెక్స్ సొల్యూషన్, రామచంద్ర బ్రదర్స్ వంటి 22 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. వయసు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. బయోడేటా, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. విద్యార్హతలను బట్టి జీతం నెలకు రూ. 12వేల నుంచి రూ. 40వేల వరకు ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆసక్తి గలగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు జె.సురేష్ 9100566581, ఎం.వీరాంజనేయులు 9160200652, ఎ.రమ్య 7702921219 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.